TEL: T/TG/ 2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు    తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

## విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954

పబ్లిషర్: హైదరాబాద్ | సంపుటి : 01 | సంచిక : 75 | నవంబర్ 02-11-2024 | పేజీలు : 5 | వెల :4/-

# బూటకపు వాగ్దానాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



◆ కాంగ్రెస్ పార్టీపై ప్రధాని మోదీ ఫైర్

**ఢిల్లీ:** మహారాష్ట్ర, జారండ్ అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కాంగ్రెస్ పార్టీ టార్గెట్ గా పలు విమర్శలు సంధించారు. కాంగ్రెస్ పార్టీ బూటకపు వాగ్దానాల పట్ల అప్రమత్తంగా ఉండాలంటూ పిలుపునిచ్చారు. ఈ మేరకు ప్రధాని మోదీ ఎక్స్ ప్లాట్ ఫాం వేదికగా ప్రత్యర్థులపై ఘాటు విమర్శలు చేశారు. "కాంగ్రెస్ కు ఓటేస్తే అది పాలన ఉండదు, ఆర్థిక వ్యవస్థ బలహీన పడుతుంది, దోపిడి పెరుగుతుంది. ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. హర్యానా ప్రజలు వారి అబద్ధాలను ఎలా తిప్పికొట్టారో.. స్థిరమైన అభివృద్ధికి నిరంతరం శ్రమించే ప్రభుత్వానికి ఎలా పట్టగట్టారో దేశమంతటికీ తెలుసు. భారతదేశ ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారు..ని కాదు!" అంటూ విమర్శించారు."కర్ణాటకలో, కాంగ్రెస్ పార్టీ అంతర్గత రాజకీయాలలో బిజీగా ఉంది.. అభివృద్ధిని అందించడానికి కూడా ఇబ్బంది పడుతోంది.. అంతే కాదు, ఇప్పటికే ఉన్న పథకాలను కూడా వెనక్కి తీసుకోబోతున్నారు. హిమాచల్ ప్రదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించడం లేదు. తెలంగాణలో కాంగ్రెస్ హామీ ఇచ్చిన రుణమాఫీ కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. గతంలో, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో వారు ఐదేళ్లపాటు ఎప్పుడూ చూడని కొన్ని పథకాలపై వాగ్దానం చేశారు. కాంగ్రెస్ ఎలా పని చేస్తుందో చెప్పడానికి అనేక ఉదాహరణలు ఉన్నాయి".. అంటూ ప్రధాని మోదీ పేర్కొన్నారు."నేడు కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్న ఏ రాష్ట్రంలో చూసినా ఆర్థిక పరిస్థితి రోజు రోజుకీ అధ్వాన్నంగా మారుతోంది. ఇచ్చిన హామీలు నెరవేరడం లేదు. ఇది నిజంగా నమ్మి ఓటేసిన ప్రజల్ని మోసం చెయ్యడమే. ఇలాంటి రాజకీయాల వల్ల పేదలు, యువకులు, మహిళలు, రైతులు బాధితులవుతున్నారు. అమలు చెయ్యలేని హామీలు ఇవ్వడం సులభమే కానీ, వాటిని అమలు చెయ్యడం కష్టమన్న విషయాన్ని కాంగ్రెస్ పార్టీ కూడా గుర్తిస్తోంది. ఎన్నికల ముందు ఎన్నెన్నో చెబుతారు. వాటిని అమలు చెయ్యడం ఎప్పటికీ సాధ్యం కాదని వారికి కూడా తెలుసు" అంటూ కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా చేసుకొని విమర్శలు కురిపించారు.

# ఉచిత గ్యాస్ సిలిండర్‌కు డబ్బు కట్టే అవసరం లేకుండా చూస్తాం

సీఎం చంద్రబాబు


- శ్రీకాకుళం జిల్లా ఈదుపురంలో దీపం-2 సభ
- ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- సిలిండర్‌కు డబ్బు కట్టిన 48 గంటల్లోనే రిఫండ్ అవుతుందని వెల్లడి



**అమరావతి:** ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇవాళ శ్రీకాకుళం జిల్లా ఈదుపురంలో ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం (దీపం-2) ప్రారంభించిన అనంతరం సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ... అస్తవ్యస్తంగా మారిన రాష్ట్రాన్ని అందరం కలిసి పోరాడి కాపాడుకున్నామని అన్నారు. ఆడబిడ్డల కోసం ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. ఇంటిని సమర్థంగా నడిపించే శక్తి ఆడబిడ్డలకు ఉందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో 50 శాతం మంది ఆడబిడ్డలు ఉన్నారని, వారంతా ఆత్మగౌరవంతో బతకాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని సీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు. నాడు రాజకీయాల్లో మహిళలకు ఎన్టీఆర్ రిజర్వేషన్లు తీసుకువచ్చారని వెల్లడించారు. మహిళల్లో శక్తిసామర్థ్యాలకు కొదవలేదని, అందుకే నాడు డ్వాక్రా సంఘాలు తీసుకువచ్చామని చెప్పారు. దీపం పథకం కింద గ్యాస్ సిలిండర్లు ఇచ్చామని, అప్పట్లోనే 59 లక్షల గ్యాస్ సిలిండర్లు ఇచ్చామని వివరించారు. ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకంపై ఎవరూ అపోహ పెట్టుకోవద్దని స్పష్టం చేశారు. గ్యాస్ సిలిండర్‌కు

మిగతా 2లో

## హిందువులపై దాడి అనాగరికం: ట్రంప్



**అమెరికా :** బంగ్లాదేశ్‌లో ఇటీవల హిందువులపై జరిగిన దాడిని రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ఖండించారు. తాను అధ్యక్ష ఎన్నికల్లో గెలిస్తే భారత్‌తో అమెరికా సంబంధాలను మరింత పటిష్ఠం చేస్తానని పేర్కొన్నారు. దీపావళి పండుగ నేపథ్యంలో సోషల్ మీడియా వేదికగా ఆయన ఈ మేరకు ఓ పోస్టు చేశారు. ఈ సందర్భంగా హిందువులకు ఆయన దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. అమెరికా అధ్యక్షుడు బైడెన్, డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్‌లు అమెరికాతోపాటు, ప్రచంలోని హిందువులను పట్టించుకోలేదని విమర్శించారు. 'బంగ్లాదేశ్‌లో హిందువులు, క్రైస్తవులతో పాటు ఇతర మైనారిటీలపై జరిగిన అనాగరిక దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను. అల్లరి మూకలు హిందువుల ఇళ్లు, దుకాణాలను లూటీ చేశారు. దీంతో ఆ దేశంలో తీవ్రమైన భయానక గందరగోళ పరిస్థితులు తలెత్తాయి.
నా సమయంలో ఎప్పుడూ ఇలాంటిది జరగలేదు. అమెరికాతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులను కమలా , బైడెన్‌లు

మిగతా 2లో

# త్వరలో రాష్ట్రమంతటా పాదయాత్ర చేస్తా - కెటిఆర్

- కార్యకర్తల కోరిక మేరకు ఈ యాత్ర
- త్వరలోనే తేదీలను ప్రకటిస్తా
- కాంగ్రెస్ ప్రభుత్వంలో పూర్తిగా క్షీణించిన శాంతి భద్రతలు
- రేవంత్ పాలన ఫ్రం ఢిల్లీ, టూ ఢిల్లీ, ఫర్ ఢిల్లీ గా ఉంది
- కెసిఆర్ వచ్చే ఏడాది నుంచి క్షేత్ర స్థాయిలో పర్యటన
- రైతులను నిండా ముంచిన దళారి ప్రభుత్వం
- ట్విట్టర్ వేదికగా రేవంత్ పై కెటిఆర్ విమర్శలు
- చిట్టినాయుడు డైవర్షన్ పాలిటిక్స్‌తో బిజీగా ఉన్నాడు: కేటీఆర్
- రైతులు పొలాల్లో కన్నీరు పెడుతున్నారన్న కేటీఆర్
- కాంగ్రెస్ దళారి ప్రభుత్వం రైతులను నిండా ముంచిందని మండిపాటు
- అకాల వర్షాలకు కల్లాలల్లో, మార్కెట్ యార్డలలో ధాన్యం తడిసిందన్న కేటీఆర్



**హైదరాబాద్:** పార్టీ కార్యకర్తల ఆకాంక్షల మేరకు భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్త పాదయాత్ర చేస్తానని ప్రకటించారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్.. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజా క్షేత్రంలో ఎండగట్టేందుకు ఈ యాత్ర చేపడతానని చెప్పారు.. పార్టీ అధ్యక్షుడు కెసిఆర్, ఇతర ముఖ్య నాయకులతో చర్చించిన అనంతరం యాత్ర తేదీలను ప్రకటిస్తానని వెల్లడించారు.. ట్విట్టర్ ద్వారా బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలతో, ప్రజలతో దీపావళి రోజున రాత్రి సమయంలో లైవ్ ద్వారా మాట్లాడిన కెటిఆర్ ఈ నిర్ణయాన్ని ప్రకటించారు.. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని, ఈ తరుణంలో తెలంగాణ ప్రజలకు అండగా ఉండాల్సిన బాధ్యత తమ పార్టీపై ఉందని అన్నారు.. న్యాయం చేయాలని కోరుతున్న పార్టీ నేతలపై వేధింపులు, అక్రమ కేసులు పెడుతున్నారని అన్నారు..అధికార పార్టీకి వత్తాసు పలుకుతున్న పోలీసులపై తాము అధికారంలోకి వచ్చిన వెంటనే

మిగతా 2లో

## ప్రజల దృష్టి మళ్లించేందుకే ఆ పార్టీల పాదయాత్ర : బండి సంజయ్

2



## గంట పాటు భారీ వర్షం..



* నగరంలోని పలు ప్రాంతాలు జలమయం

2లో

# బీసీ కమిషన్‌కు విలువలేదని హైకోర్టు చెప్పింది: పాడి కౌశిక్ రెడ్డి

- కరీంనగర్ కలెక్టరేట్‌లో అవగాహన కార్యక్రమం
- తమకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదన్న పాడి కౌశిక్ రెడ్డి
- బీసీ కమిషన్ కాంగ్రెస్ కమిషన్‌లా పని చేస్తోందని ఆరోపణ



**హైదరాబాద్:** బీసీ కమిషన్‌కు విలువలేదని హైకోర్టు చెప్పిందని, అయినప్పటికీ కమిషన్‌పై గౌరవంతో తాము వచ్చామని... కానీ తమకు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కరీంనగర్ కలెక్టరేట్‌లో నిర్వహించిన బీసీ సమస్యల పరిష్కారం కోసం రూపొందించిన అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కోరుట్ల ఎమ్మెల్యే డా.సంజయ్ పాల్గొన్నారు. అయితే ఈ బహిరంగ విచారణలో తమను మాట్లాడనీయడం లేదని కౌశిక్ రెడ్డి, ఇతర బీఆర్ఎస్ నేతలు నిరసన తెలిపారు.ఈ సందర్భంగా కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ... తమకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదన్నారు. బీసీ కమిషన్ కాంగ్రెస్ కమిషన్‌లా

## పిచ్చిగా మాట్లాడితే తాట తీస్తా

వైసిపి నేతలకు పవన్ కల్యాణ్ వార్నింగ్



2



## అధికారులపై హోం మంత్రి వంగలపూడి అనిత గరంగరం

- పాత వాసనలు వీడాలని హితవు
- సస్పెండ్ చేసే విధంగా ప్రవర్తించవద్దు
- పాయకరావుపేటలో ఉచిత గ్యాస్ పథకాన్ని ప్రారంభించిన అనిత

2లో

# త్వరలో రాష్ట్రమంతటా పాదయాత్ర చేస్తా - కెటిఆర్

కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణకు శాపంగా మారిందని, కాంగ్రెస్ పార్టీ పాలన ఫ్రం ఢిల్లీ, టూ ఢిల్లీ, ఫర్ ఢిల్లీ అన్నట్లుగా తయారైందని విమర్శించారు.. కాంగ్రెస్ పాలనలో జరిగిన పతనం నుంచి తెలంగాణ కోలుకోవడం అసాధ్యమైన స్థితికి చేరిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఓ వైపు రైతులు పొలాల్లో కన్నీరు పెడుతుంటే తెలంగాణ సీఎం చిట్టినాయుడు మాత్రం రోత పుట్టించే కూతలతో... డైవర్షన్ పాలిటిక్స్‌తో బిజీబిజీగా ఉన్నాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షం కారణంగా ఐకేపీ కేంద్రంలో ఉంచిన రైతుల ధాన్యం పూర్తిగా తడిచిపోయిందని ఓ రైతు విమర్శలు చేస్తున్న వీడియోను కేటీఆర్ పోస్ట్ చేసి... ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ దళారి ప్రభుత్వం రైతులను నిండా ముంచిందన్నారు. వానాకాలం వరికోతలు సాగుతున్నాయని... కానీ ఈరోజు వరకు రైతుబంధు వేయలేదని ఆరోపించారు. ఇక రూ.15 వేల రైతుభరోసా ఊసే లేదన్నారు. కనీసం హార్వెస్ట్ చేసిన పంటను కూడా కొనుగోలు చేయడం లేదని విమర్శించారు.

దీంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అకాల వర్షాలకు చాలాచోట్ల కల్లాలలో, మార్కెట్ యార్డుల్లో ధాన్యం తడిసి ముద్దయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ సీజన్లో 91.28 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరిస్తున్నారని, అక్టోబర్ నెలలో 8.16 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని పౌరసరఫరాల శాఖ లక్ష్యంగా పెట్టుకుందన్నారు. కానీ, అక్టోబర్ 28 వరకు 913 మంది రైతుల నుంచి 7,629 టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారని తెలిపారు. రైతన్న అంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి నిర్లక్ష్యమని విమర్శించారు. దళారులతో కుమ్మక్కైన ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం లేదని ఆరోపించారు. నేటి వరకు పూర్తి స్థాయిలో మిల్లుల కేటాయింపు జరగనే లేదన్నారు.

# ఉచిత గ్యాస్ సిలిండర్‌కు డబ్బు కట్టే అవసరం లేకుండా చూస్తాం : సీఎం చంద్రబాబు

చెల్లించిన డబ్బు 48 గంటల్లోనే లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో రిఫండ్ అవుతుందని వెల్లడించారు. ముమ్ముందు గ్యాస్ సిలిండర్ కు డబ్బు చెల్లించాల్సిన అవసరం లేకుండా చూస్తామని అన్నారు. ఆర్థిక సమస్యలు ఉన్నప్పటికీ పథకాలు అమలు చేస్తున్నామని చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రంలో 64 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నామని, అందుకోసం రూ.2,729 కోట్లు ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. అన్ని రాష్ట్రాల కంటే మనమే ఎక్కువ పింఛను ఇస్తున్నామని అన్నారు. అంతేగాకుండా, పింఛను మొత్తాన్ని మూడు నెలలకు ఒకసారి కూడా తీసుకోవచ్చని చెప్పారు. పెన్షన్ ఎవరు ఆపినా నిలదీయండి... పెన్షన్ మీ హక్కు అని చంద్రబాబు ఉద్ఘాటించారు. పెన్షన్ డబ్బును ఇంటి వద్దే గౌరవంగా ఇవ్వాలని ఆదేశించానని తెలిపారు. గతంలో కేంద్రం ఇచ్చిన నిధులను వైసీపీ ప్రభుత్వం దారిమళ్లించిందని చంద్రబాబు ఆరోపించారు. ప్రభుత్వంలో ఉన్న వారు జవాబుదారీతనంతో ఉండాలని, కానీ వైసీపీ హయాంలో ఉన్నతాధికారులను బెదిరించిన దాఖలాలు చూశామని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మార్వో ఆఫీసులనే తాకట్టు పెట్టారని మండిపడ్డారు.

తాము అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం, ఇసుక విధానాలను ప్రక్షాళన చేశామని సీఎం చంద్రబాబు చెప్పారు. ఉచిత ఇసుక విధానంలో జోక్యం చేసుకోవద్దని ఇంతకుముందే చెప్పానని, ఇసుకలో అక్రమాలకు పాల్పడితే పీడీ చట్టం కింద అరెస్ట్ చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో నాసిరకం మద్యం ఉండదు, బెల్టు షాపులు ఉండవు అని స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టులో కొత్త డయాఫ్రం వాల్ నిర్మిస్తున్నామని తెలిపారు.

ఇక, విశాఖ ఉక్కు పరిశ్రమను పరిరక్షిస్తామని హామీ ఇచ్చామని, ఆ దిశగా తమ కృషి ఫలిస్తోందని చెప్పారు. విశాఖ రైల్వే జోన్ కు మార్గం సుగమం చేశామని, విశాఖ రైల్వే జోన్ కు రేపో, ఎల్లుండో భూమిపూజ జరుగుతుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. టెక్కలి లేదా పలాసలో ఎయిర్ పోర్టు నిర్మాణం చేపడతామని, మూలపేటలో 10 వేల ఎకరాలతో ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మిస్తామని వెల్లడించారు.

రాష్ట్రంలో అర్హులైన వారందరికీ ఇళ్లు, రేషన్ కార్డులు, పెన్షన్లు అందజేస్తామని తెలిపారు. నిరుద్యోగ యువత కోసం మెగా డీఎస్సీ ప్రకటించామని, భారీ ఎత్తున పరిశ్రమలు తీసుకువచ్చేందుకు శ్రమిస్తున్నామని చెప్పారు. ఆకాశమే హద్దుగా యువతను ప్రోత్సహిస్తామని, అదే సమయంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే వారు కూడా ముందుకు రావాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. ఇక, రేపటి నుంచి రాష్ట్రంలో రోడ్ల గుంతలు పూడ్చే కార్యక్రమం చేపడుతున్నామని అన్నారు.

# పిచ్చిగా మాట్లాడితే తాట తీస్తా

**అమరావతి:** గత ప్రభుత్వం వైసీపీ చేసిన తప్పుడు విధానాల వల్ల వ్యవస్థ పాడయిందని, ఆ పార్టీ ఎన్నికలలో ఓడి 11 సీట్లు మిగిలిన వాళ్ళ నోళ్లు మూతపడటం లేదన్నారు ఏపి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్. ఏలూరు జిల్లా ద్వారక తిరుమల మండలం ఐఎస్ జగన్నాథపురంలో ఆయన దీపం పథకాన్ని నేడు ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ, లక్ష్మీ నరసింహ స్వామి సాక్షిగా చెబుతున్న భవిష్యత్తులో వైసీపీ వాళ్ల నోటి నుంచి ఇంకేమీ రాకుండా చేస్తామని అన్నారు. ఇది మంచి ప్రభుత్వమే కానీ మెతక ప్రభుత్వం కాదని అన్నారు. వైసీపీ వాళ్ళకి యుద్ధమే కావాలంటే యుద్ధమే ఇస్తాం.. గొడవే కావాలంటే అభివృద్ధికి పాటుపడే గొడవ ఇస్తామని పేర్కొన్నారు.

ఆడపిల్లల మాన, ప్రాణాలకు ఎక్కడ ఇబ్బంది కలగకుండా చూడటమే లక్ష్యమని తెలిపారు. సోషల్ మీడియాలో మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని పవన్ సూచించారు. తాము ఎవరికీ అన్యాయంగా ఎదురు తిరగలేదు.. ఆడబిడ్డల గురించి, ఇంటి ఆడపడుచుల గురించి అసభ్యంగా మాట్లాడలేదని పవన్ అన్నారు. వైఎస్ షర్మిలకు కూడా భద్రత కల్పించే బాధ్యత కూడా ప్రభుత్వం తీసుకుంటుంది. వైసీపీ వాళ్ళు కుల మతాల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తే ఊరుకునేది లేదు. 2019లో 151 సీట్లు వచ్చినపుడు మోసం చేయని ఈవీఎంలు 2024 లో ఎలా మోసం చేస్తాయని ప్రశ్నించారు.

ఇక జంగారెడ్డిగూడెం నుంచి ఇక్కడకు రావడానికి రెండున్నర గంటలు పట్టిందని, ఇది జగన్ పాలనలో జంగారెడ్డిగూడెం రోడ్ దుస్థితి అని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు సరిగా అమలు చేయలేదని అన్నారు.. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేసి చూపుతోందని అన్నారు. దీపం పథకం కింద ఏడాదికి 2,684 కోట్లు, ఐదేళ్లకు13,425 కోట్లు ఖర్చు చేస్తుందని తెలిపారు. 14 ఏళ్ల క్రితం ఐఎస్ జగన్నాధపురం ఆలయానికి వచ్చానని, .. ఇక్కడ స్వయంబుగా వెలసిన లక్ష్మినరసింహ స్వామిని ఎప్పుడు రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటానని చెప్పారు.

లక్ష్మీ నరసింహస్వామి 14 ఏళ్ల పరీక్ష పెట్టాడు.. గతంలో ఎదురైనా ఓటమితో జీవితం అంధకారం అయ్యింది.. అలాంటి సమయంలో జనసైనికులతో పాటు ధైర్యం ఇచ్చింది లక్ష్మీనరసింహస్వామి అని పవన్ కళ్యాణ్ అన్నారు. దీపం పథకం కేవలం వంటింట్లో వెలగడానికే కాదు.. పేదల ఆకలి తీర్చడానికి అని తెలిపారు. ఐఎస్ జగన్నాధపురం ఆలయానికి రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టబోతున్నామని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలన్నీ పక్కాగా అమలు చేస్తాం.. హామీలు అమలు చేయకపోతే జనసైనికుల ప్రేమ ఎంత బలంగా ఉంటుందో కోపం కూడా అంతే బలంగా ఉంటుందని చెప్పారు. పదవి వచ్చాక పదింతలు ఎక్కువగా కష్టపడే వ్యక్తిని అని అన్నారు. అభిమానులు సినిమా పేర్లు జపించడం కంటే భగవన్నామస్మరణ చేస్తే ఇంకా బాగుంటుంది.. సినిమాలో ఒక సరదా మాత్రమే.. సినిమాలు ఉండాలని అన్నారు.

**సనాతన ధర్మం కోసం చనిపోయే దాకా పోరాటం..**

గత ప్రభుత్వంలో ఉన్నతాధికారులు కూడా ప్రభుత్వానికి భజన చేశారని, కానీ. ఇపుడు వారికి హనీమూన్ పిరీడ్ అయిపోయిందన్నారు. సనాతన ధర్మం బలంగా ఉంటేనే దేశం బలంగా ఉంటుందని అన్నారు పవన్ కల్యాణ్. సనాతన ధర్మాన్ని కాపాడడం కోసం 'నారసింహ వారాహి గళం' పేరు మీద ఒక గళాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు.. ఈ గళం ఏపీ, తెలంగాణలో కూడా పని చేస్తుందని పేర్కొన్నారు. సనాతన ధర్మం కాపాడడం కోసం చనిపోయే దాకా పోరాటం చేస్తా, అందులో సందేహం లేదని పవన్ స్పష్టం చేశారు.

# బెంగళూరుకు హైడ్రా బృందం.. చెరువుల పునరుజ్జీవంపై స్టడీ టూర్

## - వచ్చిన వెంటనే నాలుగు చెరువుల సుందరీకరణ

**హైదరాబాద్:** హైడ్రా కమిషనర్ రంగనాథ్ తన బృందంతో కలిసి మరో నాలుగు రోజుల్లో కర్ణాటక రాజధాని బెంగళూరు సిటీలో పర్యటించనున్నారు. చెరువుల పునరుజ్జీవంపై బెంగళూరులో క్షేత్రస్థాయిలో పరిస్థితులను పర్యవేక్షించడానికి కమిషనర్ అక్కడికి వెళ్తున్నారు. ఇటీవల రంగనాథ్ లేక్‌మ్యాన్ ఆఫ్ ఇండియా ఆనంద్‌మల్లి గవాడ్‌తో హైదరాబాద్‌లోని తమ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఆ సమయంలో బెంగళూరులో చెరువుల పునరుద్ధరణ జరిగిన తీరుపై చర్చించారు. మురుగుతో నిండి, నీళ్లు లేకుండా ఉన్న చెరువులకు ఎలా పునరుజ్జీవం కల్పించారో తెలుసుకున్నారు. ఈ క్రమంలో బెంగళూరు వెళ్లడానికి హైడ్రా టీమ్ సిద్ధమైంది. బెంగళూరులో చెరువుల పునరుద్ధరణ, మురుగునీరు స్వచ్ఛంగా మార్చిన విధానంపై హైడ్రా కమిషనర్ అక్కడి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నారు. అక్కడ పునరుద్ధరణ జరిగిన చెరువులపై స్టడీ చేసి..ఆ విధానాలను హైదరాబాద్‌లో ఎలా వర్తింపచేయాలో ప్రభుత్వంతో చర్చించనున్నామని హైడ్రా అధికారులు చెబుతున్నారు.

చెరువులు మాత్రమే కాకుండా కొద్దిరోజుల కిందట డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై బెంగళూరు మాజీ డైరెక్టర్‌తో సమావేశమై మేనేజ్‌మెంట్ విధి విధానాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చూశారు. ఈ నేపథ్యంలో బెంగళూరులో చెరువుల పునరుజ్జీవనంపై క్షేత్రస్థాయిలో స్థితిగతులను అధ్యయనం చేయడం, డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లో అనుసరించిన విధానాలను పరిశీలించడం కోసం హైడ్రా టీమ్ బెంగళూరు వెళ్లనున్నది. అక్కడ చెరువుల అధ్యయనం తర్వాత బాచుపల్లిలోని ఎర్రగుంట చెరువు, మాదాపూర్‌లోని సున్నంచెరువు, కూకట్‌పల్లిలోని నల్లచెరువు, రాజేంద్రనగర్‌లోని



అప్పచెరువులకు పునరుజ్జీవం కల్పించాలని నిర్ణయించారు.

ఒక వర్షం పడితే బెంగళూరులో రహదారులే కాదు.. అపార్ట్‌మెంట్లకు అపార్ట్‌మెంట్లే వరదనీటిలో మునిగిపోతున్నాయి. మెట్రో రైళ్లు ఉన్నా కూడా ట్రాఫిక్ సమస్యకు ఇప్పటికీ తెరపడలేదు. బెంగళూరు తరహాలోనే హైదరాబాద్‌లోనూ ట్రాఫిక్ సమస్య ఉంది. హైదరాబాద్‌ను కూడా వరదలు ముంచెత్తాయి. అయితే బెంగళూరు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నిపుణులతో హైడ్రా అధికారులు సమావేశంపై అందరిలో చర్చ జరుగుతున్నది. అసలు బెంగళూరులో ఉన్న పరిస్థితులకు హైదరాబాద్ స్థితిగతులకు పొంతనే ఉండదని గ్రేటర్‌కు చెందిన పట్టణ విభాగ నిపుణుడు చెప్పారు. టెక్నాలజీ పరంగా అక్కడి సెన్సార్‌ల వ్యవస్థ బాగానే ఉన్నా.. డిజాస్టర్ పరంగా బెంగళూరు మేనేజ్‌మెంట్ సక్సెస్ కాలేదని, అసలు హైదరాబాద్‌లో బెంగళూరు సిస్టమే పనిచేయదన్నారు.

**మరో వంద చెరువులపై దృష్టి..**

హైదరాబాద్‌లో వంద చెరువులపై హైడ్రా దృష్టిపెట్టినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన జాబితాను కూడా హైడ్రా కమిషనర్ రంగనాథ్ పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్‌కు అందించారు. ఇందుకు సంబంధించి కొన్ని చెరువులను సీఎస్ఆర్ కింద, మరికొన్ని చెరువులను హెచ్ఎండీఏ నిధులతో అభివృద్ధి చేయనున్నారు. బెంగళూరులో చెరువుల పునరుజ్జీవం ఎలా జరిగిందో అధ్యయనం చేసి ఆ తర్వాత హైదరాబాద్‌లో చర్యలు చేపడుతారని హైడ్రా బృందం చెబుతున్నది.

# ప్రేమించానంటూ.. నమ్మించి రహస్య వివాహం

- డిపెండెంట్ వీసాతో యువతి వెంట విదేశాలకు
- ఫొటోలు బయటపెడతానంటూ బ్లాక్‌మెయిల్
- రూ.1.25 కోట్ల మేర వసూలు

**హైదరాబాద్:** ప్రేమిస్తున్నానని యువతిని నమ్మించాడు. రహస్యంగా పెళ్లి చేసుకొని ఆమె వెంట విదేశాలకు వెళ్లాడు. అక్కడ వేధింపులకు పాల్పడి రూ.1.25 కోట్లు తీసుకుని బ్లాక్‌మెయిల్ చేస్తున్న ఓ వ్యక్తిపై ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నం.12లోని ఎమ్మెల్యే కాలనీలో నివాసముంటున్న కాసోజు వైష్ణవి (24)కి 2020లో ఫేస్‌బుక్ ద్వారా కీసర పరిధిలోని నాగారం ఎస్సీ కాలనీకి చెందిన కొండపాక ఉమాపతి (30) పరిచయమయ్యాడు. వారి పరిచయం ప్రేమగా మారింది. అప్పుడప్పుడూ తనకున్న ఆర్థిక సమస్యలను చూపిస్తూ.. పలుమార్లు వైష్ణవి వద్ద నుంచి డబ్బులు తీసుకున్న ఉమాపతి తిరిగి ఇస్తానంటూ కాలయాపన చేశాడు.

కొన్నాళ్ల తర్వాత డబ్బుల కోసం ఆమెను బ్లాక్‌మెయిల్ చేయడం ప్రారంభించాడు. తనకు డబ్బులు ఇవ్వకపోతే ఇద్దరం సన్నిహితంగా ఉన్న సమయంలో దిగిన ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని, కుటుంబ పరువును మంటగలుపుతానంటూ బెదిరించడం మొదలుపెట్టాడు. దీంతో అతడి బారినుంచి తప్పించుకునేందుకు, ఉన్నత విద్య కోసం బ్రిటన్ వెళ్లేందుకు వైష్ణవి ప్రయత్నాలు ప్రారంభించింది. ఈ విషయం తెలుసుకున్న ఉమాపతి పెళ్లి చేసుకుందామంటూ ఒత్తిడి చేయడంతో పాటు అంగీకరించకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించాడు.దీంతో 2022, ఏప్రిల్ 20న స్నేహితుల సమక్షంలో ఆర్య సమాజ్‌లో వారిద్దరూ పెళ్లి చేసుకున్నారు.

పెళ్లి విషయం ఇంట్లో చెప్పకుండా దాచారు. వైష్ణవికి బ్రిటన్ వీసా వచ్చిన తర్వాత తాను కూడా డిపెండెంట్ వీసాపై బ్రిటన్ వస్తానని చెప్పి.. ఇందుకు నాగారం సబ్ రిజిస్టర్ కార్యాయంలో పెళ్లి ఫొటోలు పెట్టి రిజిస్టర్ చేశారు. ఆ తర్వాత ఇద్దరూ కలిసి బ్రిటన్ వెళ్లగా.. అక్కడ విలాసవంతమైన జీవితం గడపుతూ వైష్ణవి వద్ద నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేశాడు. శారీరకంగా, మానసికంగా వేధించడంతో పాటు సుమారు రూ.1.25 కోట్లు ఆమె వద్ద నుంచి తీసుకున్నాడు. అతడి వేధింపులు ఎక్కువ కావడంతో.. ఈ ఏడాది ఆగస్టులో వైష్ణవి ఇండియాకు తిరిగి వచ్చింది.

జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పడంతో.. ఉమాపతితో మాట్లాడేందుకు ప్రయత్నించగా అతడు నోటికి వచ్చినట్లు మాట్లాడడంతో పాటు తన జోలికొస్తే అట్రాసిటీ కేసు పెట్టి కుటుంబ సభ్యులందరినీ జైలుకు పంపిస్తానంటూ బెదిరించాడు. దీంతో బాధితురాలు గురువారం రాత్రి ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# హిందువులపై దాడి అనాగరికం: ట్రంప్

విస్మరించారు. ఇజ్రాయెల్ నుంచి మొదలుకొని, ఉక్రెయిన్, అమెరికా దక్షిణ సరిహద్దు వరకు విపత్తులు ఎన్నో ఉన్నాయి. మేం అధికారంలోకి వస్తే మళ్లీ అమెరికాను బలంగా తయారుచేసి శాంతిని నెలకొల్పుతాం. రాడికల్ లెఫ్ట్ నుంచి ఎదురవుతున్న మత వ్యతిరే ఎజెండా నుంచి హిందూ అమెరికన్లకు రక్షణ కల్పిస్తాం. హిందువుల స్వేచ్ఛ కోసం పోరాడుతాం. నా పరిపాలనలో ఇండియాతోపాటు నా స్నేహితుడు, ప్రధాని మోడీతో బలమైన భాగస్వామ్యాన్ని ఏర్పరచుకుంటాం. కమలా హారిస్ గెలిస్తే అధిక పన్నులు, కఠినమైన నిబంధనలతో మీ చిన్న వ్యాపారాలను దెబ్బతీస్తుంది. నేను గెలిస్తే పన్నులు, నిబంధనల్లో కోత విధిస్తా. అమెరికాను చరిత్రలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిర్మిస్తా అని ట్రంప్.

# ప్రజల దృష్టి మళ్లించేందుకే ఆ పార్టీల పాదయాత్ర : బండి సంజయ్

**హైదరాబాద్:** రాష్ట్రంలో బీజేపీ ఎదుగుదలను అడ్డుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి, కేటీఆర్ పక్కా ప్రణాళిక ప్రకారం పాదయాత్రలకు సిద్ధమవుతున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మానకొండూరు నియోజకవర్గం బెజ్జంకిలో ఆయన మీడియా మాట్లాడుతూ..మూసీ ప్రక్షాళనకు వెచ్చించిన లక్షన్నర కోట్లతో ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరు హామీలను అమలు చేయకుండా రాహుల్ గాంధీ కోసం రేవంత్ రెడ్డి మూసీ ప్రక్షాళన జపం చేస్తున్నారని విమర్శించారు. పాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మరల్చే విధంగా.. నాడు కేసీఆర్ చేసినట్లుగానే నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందని విమర్శించారు. ఆరు గ్యారెంటీలపై సీఎం రేవంత్ రెడ్డి పాదయాత్ర చేసే దమ్ముందా అని సవాల్ చేశారు. ప్రధాని మోడీపై యుద్ధం చేస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి ముందుగా అరు గ్యారంటీల అమలు చేయాలని డిమాండ్ చేశారు.గతంలో తను చేపట్టిన ప్రజా సంగ్రామ పాదయాత్రను అడ్డుకునేందుకు ప్రయత్నించిన బీఆర్ఎస్%ా% ఇప్పుడు పాదయాత్ర చేయడం విడ్డూరమన్నారు. ప్రతిపక్ష బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫామ్ హౌస్ నుంచి బయటకు రావడం లేదని, బీఆర్ఎస్ పరిస్థితి నాయకుడు లేని ఓడలా ఉందని, కేటీఆర్ అహంకార వైఖరిని ప్రజలు అసహ్యించుకుంటున్నారని అన్నారు.బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ ఒక్కటేనని, ఏ విషయంలోనూ బీఆర్ఎస్ అగ్రనేతలకు ఇప్పటిదాకా కాంగ్రెస్ పార్టీ నోటీసులు ఇవ్వలేదన్నారు. దీపావళి ముందు బాంబులు పేలుతాయన్న మంత్రుల మాటల ప్రకారం బాంబులు పేలలేదు ఎద్దేవ చేశారు. ఏమన్నా అంటే కేంద్రం సహకరించడం లేదంటారని దుయ్యబట్టారు.

# బీసీ కమిషన్‌కు విలువలేదని హైకోర్టు చెప్పింది: పాడి కౌశిక్ రెడ్డి

తయారయిందని మండిపడ్డారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కమిషన్‌ను కోరినట్లు చెప్పారు. అభిప్రాయం చెప్పేందుకు బీఆర్ఎస్ తప్ప ఎవరూ రాలేదన్నారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు ఎందుకు రాలేదో చెప్పాలన్నారు. కొత్త కమిషన్ వేయాలని కోర్టు చెప్పినప్పటికీ ఈ బహిరంగ విచారణ ఎందుకు చేపరదుతున్నారని ప్రశ్నించారు.బీసీ కమిషన్ పబ్లిక్ హియరింగ్‌పై మా అభిప్రాయం (బీఆర్ఎస్) అంటూ కౌశిక్ రెడ్డి ట్వీట్ చేశారు. "మేము ప్రస్తుత పద్ధతులను చట్ట ప్రకారం చెల్లుబాటు కానివిగా భావిస్తున్నాం. కులగణనలో శాస్త్రీయత ఉండి, బీసీల సంక్షేమం కోసం ప్రత్యేక బీసీ కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నాం" అని పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం బలహీన వర్గాలను మోసం చేస్తోందని పేర్కొన్నారు. కానీ బలహీన వర్గాల కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీ గురుకులాలు, బీసీ బంధు వంటి పథకాలతో అండగా నిలిచిందన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బీసీ కమిషన్‌పై నమ్మకం లేక కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఒక్కరి కూడా హాజరుకాలేదని విమర్శించారు.

# గంట పాటు భారీ వర్షం..

**హైదరాబాద్:** హైదరాబాద్ నగరాన్ని భారీ వర్షం ముంచెత్తింది. నగరంలోని అనేక కాలనీలు జలమయమయ్యాయి. రోడ్లపై భారీగా నీరు నిలిచింది. నిజాంపేట్, మేడ్చల్, ఖైరతాబాద్, మలక్ పేట్, మియాపూర్, కొండాపూర్, మూసాపేట్, మెహెదీపట్నం, కేపీహెచ్ బీ కాలనీ, దుండిగల్, కండ్లకోయ, జూబ్లీహిల్స్, కూకట్ పల్లి, చార్మినార్, మల్లంపేట్, బోయిన్ పల్లి, కృష్ణాపూర్, మణికొండ, హైటెక్ సిటీ, బేగంపేట, గండి మైసమ్మ, లింగపల్లి, మాదాపూర్ ప్రాంతాలు భారీ వర్షంతో తడిసి ముద్దయ్యాయి. లింగపల్లి రైల్వే అండర్ పాస్ వద్ద భారీ నీరు నిలవడంతో, ఆ మార్గంలో ట్రాఫిక్‌ను ఆపేశారు. గచ్చిబౌలి-, లింగపల్లి రూట్లో వచ్చే వాహనాలను నల్లగండ్ల ఫ్లైఓవర్ మీదుగా మళ్లించారు. ఓ చోట ఆర్టీసీ బస్సులోకి నీరు ప్రవేశించడం సోషల్ మీడియాలో ఓ వీడియోలో కనిపించింది. హైదరాబాదు నగరంలో మధ్యాహ్నం వరకు ఎండతో వాతావరణం వేడిగా ఉండగా, ఆ తర్వాత వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. గంట పాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఉపరితల ఆవర్తనం కారణంగా తెలంగాణలో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ఇప్పటికే ప్రకటించడం తెలిసిందే.ం

# అధికారులపై హోం మంత్రి వంగలపూడి అనిత గరంగరం

**అమరావతి:** అధికారుల్లో ఇంకా పాత వాసన ఉందని, వెంటనే దానిని విడనాడాలని సూచించారు హోం మంత్రి వంగలపూడి అనిత. తాను ఎక్కడ ఉన్నా.. ఏ అధికారి ఎలా పని చేస్తున్నారో డేటా ఉంటుందని తెలిపారు. తాను ఎప్పుడు అధికారులను సస్పెండ్ చేసే విధంగా చర్యలు తీసుకోలేదని.. అలాంటి పరిస్థితిని తీసుకురాకండని అధికారులకు సూచించారు. అధికారులు తప్పు చేస్తే ఉపేక్షించేంది లేదని అన్నారు. ఎవ్వరైనా అధికారులు అవినీతి చేస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామని తెలిపారు.అనకాపల్లి జిల్లా పాయకరావుపేట పట్టణంలో పంచాయితీ రాజ్ ప్రభుత్వ గెస్ట్ హౌస్ వద్ద మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీని అనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని అన్నారు. ఈ క్రమంలో ప్రధాని మోడీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

గత ఐదు సంవత్సరాలుగా గ్యాస్ పొయ్యి వెలిగించాలి అంటే మహిళలు భయపడేవారని పేర్కొన్నారు. గతంలో గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగి ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు.. అప్పటిలో మహిళల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని చంద్రబాబు దీపం పథకం ప్రవేశపెట్టారని అనిత అన్నారు. ఇప్పుడు మరల దీపం-2 పథకం ప్రవేశపెట్టి, మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు.

రాష్ట్ర ఖజనాలో ప్రస్తుతం డబ్బులు జీరో అని హోంమంత్రి అనిత పేర్కొన్నారు. త్వరలో పాయకరావుపేటలో అన్నా క్యాంటీన్ ప్రారంభిస్తామని చెప్పారు. పాయకరావుపేట నియోజకవర్గంలో తాము వేసిన రోడ్లు తప్ప ఒక్క రోడ్డు వేయలేదని ఆరోపించారు. త్వరలో పాయకరావుపేటలో డబుల్ రోడ్డు వేస్తాం.. పాయకరావుపేటకు ఒక గుర్తింపు తీసుకువస్తామని అనిత అన్నారు. వైసీపీ పాలనలో గ్రామ సర్పంచ్‌లకు చేతులకు సంకేళ్ళు వేశారని దుయ్యబట్టారు. ఎన్డీయే ప్రభుత్వంలో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని హోంమంత్రి అనిత తెలిపారు.

# మద్యం మత్తులో నిప్పంటుకొని ..

**బంజారాహిల్స్ :** మద్యం మత్తులో ఉన్న వ్యక్తికి ప్రమాదవశాత్తూ నిప్పంటుకొని మృతి చెందిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. రోడ్ నంబర్ .1లోని హిందూ శ్మశానవాటికలో దీపావళి సందర్భంగా గురువారం రాత్రి నుంచి కొందరు వ్యక్తులు తమ కుటుంబసభ్యుల సమాధుల వద్ద దీపాలు వెలిగించారు. అదే ప్రాంతంలో తిరుగుతున్న ఓ గుర్తుతెలియని వ్యక్తి (45) శుక్రవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో శ్మశానవాటికలో వళ్లంతా మంటలతో కనిపించాడు. గమనించిన జీహెచ్ఎంసీ స్వీపర్లు జ్యోతి, సీత అతడి వద్దకు వెళ్లి అక్కడున్న బోరింగ్‌లో నుంచి నీళ్లు తోడి మంటలు ఆర్పేందుకు యత్నించారు.

అయినా మంటలు ఆరకపోవడంతో సదరు గుర్తుతెలియని వ్యక్తి కాలుతున్న శరీరంతోనే రోడ్డుమీదకు పరుగులు పెట్టాడు. దీంతో అటుగా వెళ్తున్న ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. స్థానికులు అతడి వంటి మీద దుప్పటి వేసి మంటలు చల్లార్చి ఆస్పత్రికి తరలించగా, అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. ఘటనా స్థలానికి చేరుకున్న బంజారాహిల్స్ పోలీసులు విచారణ చేపట్టారు. మద్యంతో మత్తులో సమాధుల వద్ద పెట్టిన దీపానికి తాకడంతో దానిలోని నూనె ఒలికిపోయి మంటలు చెలరేగి ఉండవచ్చని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# బీసీ కులాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలి

## బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌కు వినతి పత్రం అందజేత



**మెట్‌పల్లి (మన వెలుగు ) నవంబర్ 01:** బీసీ కులాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కోరుట్ల బిసి చైర్మన్ మరియు కన్వీనర్ పుప్పాల లింబాద్రి తోగిటి అంజయ్యలు మాట్లాడుతూ. ఈడబ్ల్యూయస్ రిజర్వేషన్ల తోని బీసీలకు తెలంగాణ రాష్ట్రంలో తీవ్ర అన్యాయానికి గురి అవుతున్నారని అమలు చేయకుండా చర్యలు తీసుకోవాలని మరియు బిసి ఉద్యోగస్తులకు ప్రమోషన్లలో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని మరియు ధరల పెరుగుదలకు అనుగుణంగా విద్యార్థులకు భారీగా మేస్ చార్జీలు పెంచాలని స్థానిక ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్లు ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలని బీసీ కులవృత్తులకు సబ్సిడీ 100శాతం రుణాలు ఇవ్వాలని ప్రతి కుటుంబానికి 10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకులు శికారి గోపి కృష్ణ ఆకుల ప్రవీణ్ బీర్కురి విజయ్ అల్లే ప్రవీణ్ వెంకటేష్ శంకర్ రోజా తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబ సర్వే విధుల నుండి మినహాయించండి




**ముధోల్ ( మన వెలుగు ) నవంబర్ 01 :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక–ఆర్థిక–విద్యా–ఉపాధి–రాజకీయ కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) విధుల నుండి మినహాయించండని రాష్ట్ర సిఐటియు కార్యవర్గం ఆదేశాల మేరకు అంగన్వాడీ టీచర్స్ ముధోల్ తహసీల్దార్ శ్రీకాంత్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడి టీచర్లు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాది రాజకీయం, కుల సర్వే (సమగ్ర) ఇంటింటి కుటుంబ సర్వే) చేయుడానికి అంగన్వాడీ టీచర్లను ఎన్యుమరేటర్ లుగా వేశారని, ప్రస్తుతం పిల్లల బరువులు, పిల్లలకు బాలామృతం పంపిణీ, ఎంఎల్.సి ఎన్నికల నేపథ్యంలో బిఎల్ఒ విధులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పని ఒత్తిడి ఎక్కువగా కావడం వలన అంగన్వాడీ టీచర్స్ లను సమగ్ర ఇటింటి కుటుంబ సర్వేలో ఎన్యుమరేట్ విధులనుండి మినహాయింపు ఇవ్వాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ అధ్యక్షురాలు ఎస్. రేష్మ, అంగన్వాడీ టీచర్లు వనిత, బి.రాణి, తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఇంటి జాబితా తయారి



**ముధోల్ ( మన వెలుగు ) నవంబర్ 01 :** మండల కేంద్రమైన ముధోల్ లో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఇంటి జాబిత తయారు చేయడంలో భాగంగా ఎంపీడీవో శివకుమార్ స్టిక్కర్లను అంటించే కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వం ఈనెల 6 నుండి సమగ్ర కుటుంబ సర్వే ను ప్రతిష్టాత్మకంగా చేపట్టేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను చేస్తుంది. ఏర్పాట్లలో భాగంగా ఇంటి జాబితాను తయారు చేయడంతో పాటు ఇంటికి స్టికరింగ్ వేస్తున్నారు. జాబితాను అందించిన తర్వాత ఎన్యుమరేటర్ లు ఇంటింటికి తిరుగుతూ కుటుంబ సర్వే ను చేపట్టనున్నారు. ఎన్యుమరేటర్ లకు ఇప్పటికే శిక్షణ కార్యక్రమాన్ని సహితం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను చేయడం జరిగిందని వెల్లడించారు. కుటుంబ వివరాలను సక్రమంగా అందించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవో ప్రసాద్ గౌడ్, జూనియర్ అసిస్టెంట్ అనూష, గ్రామపంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

# భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోండి



**ముధోల్ ( మన వెలుగు ) నవంబర్ 01 :** బాసరలోని ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి శుక్రవారం వీడీసీ కమిటీ సభ్యులు తాసిల్దార్ పవన్ చంద్రాకు వినతిపత్రం అందజేశారు ఇప్పటికే కొందరు వ్యక్తులు ప్రైవేటు భావన నిర్మాణాల కోసం భూమిని చదును చేసి పనులు చేపట్టారాని వాటిపై సమగ్ర సర్వే చేపట్టి భూమిని కాపాడాలని కోరారు ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు

# మందులు లేకుండా బస్తి దావఖానాలు నడిపించడం వృధా



## సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్

**కుత్బుల్లాపూర్ ( మన వెలుగు ) నవంబర్ 01 :** సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో నేడు శ్రీనివాస్ నగర్ ఈ సేవ సెంటర్ వద్ద ఉన్నా బస్తి దావఖాన ను సందర్శించడం జరిగింది పేద ప్రజలకు వైద్యాన్ని ఉచితంగా అందుబా టులో ఉంచడానికి గత ప్రభుత్వం ఢిల్లీ తరహాలో బస్తి దావఖానలను ప్రారంభించడం జరిగింది. కానీ నేడు ఆ బస్తి దావఖనలో కనీసం బీపీ,షుగర్ లాంటి మందులు కూడా లేవని ప్రజలు రోగులు నిత్యం మందులు లేవని తిరిగి వెళ్ళిపోతున్నారని, ఉన్న మందులు కనీసం 10రొజులకు కూడా సరిపోవట్లేదని అలాగే రక్త పరీక్షలు కూడా సరిపోను చెయ్యట్లేదని దానికి సరిపడా సైరాంజీ లు లేవని డాక్టర్,లాబ్ అసిస్టెంట్ చెపుతున్నారని దీని వల్ల ప్రజలకు ఉపయోగమే లేకుండా పోయిందని కావున అధికారులు తక్షణమే స్పందించి రోగులకు సరిపడా నాణ్యమైన మందులను సరఫరా చెయ్యాలని, ప్రభుత్వానికి చేతకాకపోతే ప్రజలను మభ్యపెట్టకుండా ఆసుపత్రిలను మూసుకోవాలని అన్నారు. డిస్ట్రిక్ట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ గారికి ఫోన్ లో సిపిఐ నాయకత్వం సంప్రదిస్తే నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని, ఇలాంటి డి ఎమ్ హెచ్ ఓ వల్ల ప్రజలకు ఉపయోగం లేదని ఇలాగే వ్యవహరిస్తే పై అధికారులకు పిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కార్యవర్గ సభ్యులు సదానంద్, సహాదేవ్ రెడ్డి,మునిసిపల్ అధ్యక్షుడు రాములు, జైపాల్ రెడ్డి,ప్రజానాట్యమండాలి బాబు, స్థానికులు కయ్యూమ్, క్రాంతి, ఇమామ్ పాల్గొన్నారు.

# ఇంద్ర గాంధీకి నివాళ్లు అర్పించిన కోలన్ హనుమంత్ రెడ్డి



**కుత్బుల్లాపూర్ ( మన వెలుగు ) నవంబర్ 01 :** భారతీయ మహిళా శక్తికి ధైర్య సాహసాలకు ప్రతీక దురదనం జమీందారీ వ్యవస్థను అంతం చేసిన ధీశాలి హరిత విప్లవంతో పంటలు ఉత్పత్తిని పెంచిన అన్నపూర్ణ గరీబీ హటావో తో పేదరికాన్ని అసమానతల్ని తగ్గించిన మహానేత అలీన విధానమే కాదు అనుబాంబు పరీక్షను చేపట్టిన ఉక్కు మహిళ భారతరత్న స్వర్గీయ ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజక వర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్ఎంసి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి ఇందిరా గాంధీ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో 18 డివిజన్ కార్పొరేటర్ కొలన్ వీరేందర్ రెడ్డి, కొలన్ సత్తిరెడ్డి, ఆగం శంకర్ ముదిరాజ్, కొలన్ జీవన్ రెడ్డి, సిహెచ్ జీతయ్య, డివిజన్ అధ్యక్షులు రాజిరెడ్డి, వీరబాబు, మధుసూదన్ రెడ్డి, కృష్ణంరాజు, గంగాధర్, శ్రీనివాస్, శరత్, ప్రవీణ్, ఎన్ ఎస్ యు ఐ నాయకులు గోంగుల నవీన్, యువజన కాంగ్రెస్ లీడర్ విష్ణు, రఫియా బేగమ్, భిక్షాన, మల్లికార్జున్, వర్మ రాజు, లోకానందం, కోటేశ్వరి, హరినాయక్, నవీన, శివారెడ్డి మరియు తదితరులు పాల్గొన్నారు.

# దీపావళి వేళ రోకడ్ ఖాతాలు ప్రారంభం



**ముధోల్ (మన వెలుగు) నవంబర్ 01 :** జిన్నింగ్ ఇండస్ట్రీలకు పేరుగాంచిన బైంసా పట్టణంలో, పరిశ్రమల ఖాతాలు ప్రత్యేకంగా ఉంటాయి. వీటిని రోకడ్ ఖాతాలంటారు. సాధారణ ఖాతా బుక్కులకు భిన్నంగా రోకడ్ ఖాతాలు ఉంటాయి ఈ ఖాతా పుస్తకాలు విభిన్న కోణంలో ఉంటాయి. ఈ ఖాతాలను రాయాలంటే అనుభ వజ్ఞులు కావాల్సిందే. మన రాష్ట్రంలోనే ప్రత్యేకంగా బైంసా లో రోకడ్ ఖాతాలు రాస్తారంటే దీనికో ప్రత్యేకత ఉంది. సంవత్సరాల తరబడి కంపెనీ లావాదేవీ ప్రస్తుతం కంప్యూ టర్ యుగం అయినప్పటికీ ఇప్పటికీ జిన్నింగ్ ఇండస్ట్రీలో రోకడ్ ఖాతాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు బైంసాలో జిన్నిం గ్ ఫ్యాక్టరీలో పనిచేసే కొంతమంది ఖాతాలు రాయడంలో చాలా సంవత్సరాల అనుభవంతో ఉన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా వారు విధులు నిర్వహిస్తున్నారు. విభిన్న రీతిలో రోకడ్ ఖాతాలు రాస్తూ వీరందరూ తమ వృత్తి నిర్వహణలో ప్రత్యేకతను చాటుకుంటున్నారు.

# మోమినాపూర్ గ్రామంలో బజరంగ్ యూత్ ఆధ్వర్యంలో 1001 దీపారాధన



**ఎద్దూర్ ( మనవెలుగు ) నవంబర్ 01 :** మద్దూరు మండల్ మోమినాపూర్ గ్రామంలో దీపావళి పండుగ గ్రామ ప్రజలు ఘనంగా చేసుకోవడం జరిగింది. ప్రతి సంవత్సరం లాగానే 1001 దీపారాధన బజరంగ్ యూత్ గూళ్ళ శ్రీకాంత్, బొంత నరేష్, గాడి విష్ణు, గుల్ల నరేష్, నరేష్, మరియు గ్రామ ప్రజలు యువకులు అందరూ కలిసి 1001 దీపారాధనను శ్రీఆంజనేయ స్వామి గుడి దగ్గర ఘనంగా చేసుకోవడం జరిగింది. ప్రతి సంవత్సరం దీపావళి రోజున ఈ 1001 దీపారాధన మోమినాపూర్ గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి గుడి దగ్గర ఈ కార్యక్రమం నిర్వహించడానికి బలమైన కారణం ఉంది అని గ్రామ ప్రజలు యువకులు అంటున్నారు. మన తెలంగాణలో ఎక్కడ లేనటువంటి శ్రీ ఆంజనేయ స్వామి గుడిలో శ్రీరాముడు మరియు ఆంజనేయ స్వామి ఓకే గర్భగుడిలో ఉండటం పెద్ద విశేషం ఇటువంటి గుడి మన తెలంగాణలో మా గ్రామంలో ఉన్నందుకు చాలా సంతోషి స్తున్నామని గ్రామ ప్రజలు యువకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# సయ్యద్, పఠాన్, మొగల్, శాఫాయి తెగలను సైతం బిసిఈ లో కలపండి

**గత 15 సంవత్సరాలుగా విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ఈ నాలుగు తెగలు తీవ్రంగా నష్టపోతున్నాయి**

**బీసీబికి చెందిన వారిని బీసీఈ లో సర్టిఫికెట్లు పొందకుండా చర్యలు చేపట్టండి**

**బీసీ కమిషన్ కు వినతిపత్రం అందజేత**

**సానుకూలంగా స్పందించిన బీసీ కమిషన్ చైర్మన్**

**ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్**



**కరీంనగర్ ప్రతినిధి ( మన వెలుగు ) నవంబర్ 01 :** సయ్యద్, పఠాన్, మొగల్ షాఫాయి అనే ముస్లిం తెగలను ఏప్రాతిపదికన 4శాతం రిజర్వేషన్ల నుంచి తొలగించారో స్పష్టం చేయాలని, ఎలాంటి కారణం లేకుండా కేవలం ఒకే ఒక్క షేక్ తెగతో పాటు కొన్ని ముస్లిం తెగలను మాత్రమే అప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం ముస్లింలను సంతృప్తి పరచడానికి 10శాతం అని చెప్పి, 4శాతమే రిజర్వేషన్లు కల్పించి, పైన తెలిపిన నాలుగు మెజారిటీ తెగలను 4శాతం బీసీఈ రిజర్వేషన్ల కల్పన నుంచి పక్కన పెట్టడాన్ని తీవ్రంగా పరిగణిస్తూ.. ఏఐఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఆపార్టీ కార్పొరేటర్లు నాయకులు బీసీ కమిషన్ చైర్ పర్సన్ కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఎంఐఎం పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో స్థానిక సంస్థల రిజర్వేషన్లు కల్పనపై నిర్వహించిన బీసీ కమిషన్ బహిరంగ విచారణకు హాజరై ముస్లింల ఆవేదనను వినిపించారు. ఈ సందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల తరహాలో బీసీ బి నీ మినహాయించి ముస్లింల అందర్నీ బీసీఈలో కలపాలని డిమాండ్ చేశారు. గత 15 సంవత్సరాలుగా కేవలం ఒకే ఒక్క షేక్ తెగకు సంబంధించిన వారితో పాటు కొన్ని సంచార జాతుల వారికి ఈ బీసీ రిజర్వేషన్లు అమలు అవుతున్నాయని ముస్లింలలో సయ్యద్, పఠాన్, మొగల్, షాఫాయి తెగలకు సంబంధించిన వారు మెజార్టీగా పేదరికంలో దారిద్ర రేఖకు దిగువన ఉండి దుర్భర జీవితం గడుపుతున్నారని, ఈ నాలుగు తెగలలో పేదలుగా ఉన్న వారిని గుర్తించి బీసీలు రిజర్వేషన్లు కల్పించాలని, చాలావరకు ఈ నాలుగు తెగలకు సంబంధించిన వారు విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు. బీసీబి ముస్లిం తెగ వారిని బీసీఈ లో సర్టిఫికెట్లు పొందడాన్ని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, జిల్లా కలెక్టర్, రెవెన్యూ యంత్రాంగం దృష్టి సారించి నిరోధించేట్లు తక్షణ కర్తవ్యంగా చర్యలు చేపట్టాలని కోరారు. బీసీబీ రిజర్వేషన్లో చదువుకొని కేవలం ఉద్యోగాల కోసం మాత్రమే బీసీఈలో దొంగ చాటున సర్టిఫికెట్లను పొందడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు, ఇందులో కొంతమంది రెవెన్యూ అధికారులు లంచాలు పుచ్చుకొని సరైన విచారణ జరపకుండానే బిసిబి ముస్లిం తేగవారిని బీసీఈ లో సర్టిఫికెట్ ఇస్తున్నారని, దీనిని తీవ్రంగా పరిగణించాలని కోరుతూ తన అభిప్రాయాన్ని బీసీ కమిషన్ ఎదుట వెల్లడించారు. తక్షణమే స్పందించిన బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ ఎంఐఎం పార్టీ చేసిన విజ్ఞప్తులను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. సయ్యద్, పఠాన్, మొగల్, షాఫాయి తెగలను బీసీఈ లో కలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నివేదిస్తామన్నారు. అలాగే బీసీబి ముస్లిం తెగకు సంబంధించిన వారిని బిసిఈ లో సర్టిఫికెట్లు పొందకుండా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకెళ్తామని, కరీంనగర్ జిల్లాలో సైతం ఈసర్టిఫికెట్లు తప్పుదోవలో తీసుకోకుండా నిరోధించాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించినట్లు గులాం అహ్మద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ,ఎంఐఎం నగర ప్రధాన కార్యదర్శి సయ్యద్ బర్కత్ అలీ, జాయింట్ సెక్రటరీలు సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రి యూసుఫ్, ఆతిన అతిఫ్, ఖమరుద్దీన్, కోశాధికారి ఇబ్రహీం, కోకార్పొరేటర్లు అలీ బాబా, అజర్ దబీర్ తదితరులు పాల్గొన్నారు.

# భార్యను హత్య చేసిన భర్త అరెస్ట్




**మల్లాపూర్ / మెట్ పల్లి ( మన వెలుగు ) నవంబర్ 01 :** జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం వేంపల్లి గ్రామానికి చెందిన వెలుమల రమేష్ (35) జగిత్యాల మండలం అల్లిపూర్ గ్రామానికి చెందిన సునీత (26) తో 2015లో వివాహం జరిగింది. వీరికి ఒక కూతురు (8) ఒక కొడుకు (6) ఉన్నారు. కాగ రమేష్ ఉపాధి నిమిత్తం దుబాయ్ దేశం వెళుతూ ఉంటాడు వెలుమల రమేష్ నెలరోజుల క్రితం దుబాయ్ నుంచి తిరిగి ఇండియాకు వచ్చాడు. అప్పటి నుండి తన భార్య సునీత ఎవరితోనో అక్రమ సంబంధం పెట్టుకుందని తరచూ అనుమానిస్తూ వేధించేవాడు. రమేష్ కు తన భార్య పై అనుమానం ఇంకా బలపడడంతో గత నెల 30 న రమేష్ సునీత మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ వాగ్వాదంలో సునీత ముక్కుపై ఎడమ కన్నుపై దాడి చేశాడు అనంతరం ఆమె గొంతు నులిమి హత్య చేశాడు. అనంతరం రమేష్ పరారయ్యాడు. సునీత తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు రమేష్ కోసం పోలీసులు గాలిస్తూ ఉండగా ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీలో రమేష్ తలదాచుకున్నా డనే సమాచారం మేరకు కోరుట్ల సీఐ సురేష్ బాబు, మల్లాపూర్ ఎస్ఐ కిరణ్ కుమార్ ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీలో ఉన్న రమేష్ ను పట్టుకుని విచారించగా రమేష్ తన భార్యను గొంతు నులిమి చంపినట్లు అంగీకరించాడు. ఇద్దరు పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి రమేష్ ను అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలిస్తున్నట్లు డిఎస్పీ ఉమామహేశ్వరరావు తెలిపారు. కోరుట్ల సీఐ సురేష్ బాబు, మల్లాపూర్ ఎస్సై కిరణ్ కుమార్ లను డిఎస్పీ ఉమామహేశ్వరరావు అభినందించారు.

# రైతులకు శతగోపాం పెట్టిన సహకార సొసైటీ



**నిర్మల్ ప్రతినిధి ( మన వెలుగు ) నవంబర్ 01 :**బాసర మండలంలోని సహకార సంఘంలో అమ్మబడుతున్న శనిగ విత్తనాలు 25కేజీ బ్యాగు దొర 2300 అమ్మబడుతున్నాడు సహకార సంఘం అమ్మిన విత్తనాలను బాసర రైతైనటువంటి అల్లం గారి సాయిదాస్ అనే రైతు నాలుగు బస్తాలు కొనుగోలు చేయడం జరిగింది శుక్రవారం దానిని విప్పి చూస్తే దాంట్లో చిన్న చిన్న మట్టి పెల్లలు మరియు చిన్నచిన్న రాళ్లు ఉండడంతో రైతు ఆందోళన చెందాడు ఇప్పటికైనా సహకార సంఘం సొసైటీ కళ్ళు తెరిచి నాణ్యమైన బస్తాలను రైతులకు అందించాలని రైతులు కోరుతున్నారు

# సీఎం సహాయ నిధి చెక్కు అందించిన మాజీ ఎమ్మెల్యే



**ముధోల్ ( మన వెలుగు )నవంబర్ 01 :**తానూరు మండలంలోని ఝరి (బి) గ్రామానికి చెందిన ఉండేపుడు సవితకి సుమారు 26 వేల రూపాయల సీఎం సహాయ నిధి చెక్కును భాదిత కుటుంబానికి అందజేయడం జరిగింది. సీఎం సహాయనిధి చెక్కు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్కకి ముధోల్ మాజీ ఎమ్మెల్యే జి. విఠల్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ దేవిదాస్, దిగంబర్, ఉండేపోడ్ లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకుడు సాయినాథ్ తదితరులు ఉన్నారు.

# అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



**నిర్మల్ ప్రతినిధి (మన వెలుగు) నవంబర్ 01 :**అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బిజెపి నాయకుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కడెం మండలంలోని ఉండుపూర్ గ్రామంలో శుక్రవారం కురిసిన వర్షానికి నేలకొరిగిన వరి పొలాలను పరిశీలించారు. పలు గ్రామాల్లో చేతుకు వచ్చిన పంట నేలకొరిగి భారీ నష్టాన్ని రైతులకు మిగిల్చింది దీనిని ప్రభుత్వం గమనించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు

# దీపావళి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



**నిర్మల్ ప్రతినిధి (మన వెలుగు) నవంబర్ 01 :**భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీ లోని తన నివాసం లో శుక్రవారం దీపావళి పండుగ సందర్భంగా నిర్వహించిన మహాలక్ష్మి పూజ వేడుకల్లో ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ కుటుంబ సభ్యులతో కలిసి పూజలో పాల్గొన్నారు. ప్రముఖ పూజారి బాబ్బు మహారాజ్ ఆధ్వర్యంలో పూజలు జరిపారు. పలువురు ప్రముఖులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు వచ్చి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి అందరి ఇండ్లలో ఆనందాన్ని నింపాలని నియోజకవర్గ ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## నోటి దుర్వాసన ఈ చిట్కాలను పాటించండి..!

నోటి దుర్వాసన సమస్య అనేది మనకు సహజంగానే అప్పుడప్పుడు వస్తుంటుంది. నోట్లో బాక్టీరియా పేరుకుపోవడం వల్ల ఈ సమస్య అనేది వస్తుంది. అయితే నోటి దుర్వాసన ఉంటే నలుగురిలోనూ మాట్లాడాలంటే ఎంతో ఇబ్బందిగా ఉంటుంది. నోరు తెరిచేందుకే ఇబ్బందులు పడతాం. నోటి దుర్వాసన సమస్యనే హాలిటోసిస్ అని కూడా అంటారు. ఇది వచ్చేందుకు అనేక కారణాలు ఉంటాయి. ఈ సమస్య అనేది వయస్సుతో నిమిత్తం లేకుండా అన్ని వయస్సుల వారికి వస్తుంది. ముఖ్యంగా దంతాలను శుభ్రంగా ఉంచుకోకపోవడం, నోటిని సరిగ్గా శుభ్రం చేయకపోవడం, తరచూ సరిగ్గా బ్రష్ చేయకపోవడం, దంతాల సందులను క్లీన్ చేసుకోకపోవడం, పలు రకాల మెడిసిన్లను వాడడం లేదా జీర్ణ సమస్యలు ఉన్నా నోరు దుర్వాసనగా ఉంటుంది.పలు రకాల చిట్కాలను పాటించడం వల్ల నోటి దుర్వాసన సమస్య నుంచి సులభంగా బయట పడవచ్చు. నోటి దుర్వాసన సమస్యను తగ్గించుకోవాలంటే కచ్చితంగా రోజుకు 2 సార్లు బ్రష్ చేయాలి. దీంతో నోట్లో బాక్టీరియా పేరుకుపోదు. ఫలితంగా దుర్వాసన తగ్గుతుంది. అలాగే ఆలివ్ ఆయిల్ లేదా విటమిన్ ఇ ఆయిల్, బాదంనూనె వంటి వాటితో మీ దంతాలు, చిగుళ్లను అప్పుడప్పుడు మసాజ్ చేస్తుండండి. నోటి దుర్వాసన మరీ ఎక్కువగా ఉంటే ఈనూనెలతో రోజూ మసాజ్ చేయండి.

# గురువారం షిరిడీ సాయిబాబును ఇలా పూజించి చూడండి..

# అనుగ్రహంతో కష్ట, నష్టాలు దూరం అవుతాయి..

షిర్డీ సాయిబాబా మహిమ అపరిమితమైనదని భక్తుల విశ్వాసం. ఆయన ఎప్పుడూ కులం, మతం లేదా జీవుల మధ్య వివక్షత చూపలేదు. ఎవరైతే భక్తితో సాయిబాబాని పిలిస్తే తన భక్తులను చేరుకుంటాడని ప్రజలు అంటారు. గురువారాల్లో ఉపవాసం ఉండటం వల్ల సాయి ప్రత్యేక అనుగ్రహం తన భక్తులపై కురుస్తాడు. సాయిబాబా ఎప్పుడూ 'సబ్ కా మాలిక్ ఏక్ హై ' అనే సందేశాన్ని ఇచ్చేవారు.గురువారం సాయిబాబా ఆరాధనకు చాలా పవిత్రమైనదిగా భావిస్తారు. అందుకే సాయిబాబాను విశ్వసించే వారు ఆయనను పూజలతో పూజించడమే కాకుండా ఆయన ఆశీస్సులు పొందేందుకు ఉపవాసం కూడా ఉంటారు. సాయిబాబాను హృదయపూర్వకంగా ఆరాధిస్తే తన భక్తులు కోరిన కోర్కెలు తీరుస్తాడని విశ్వాసం. ఎవరైనా షిర్డీ సాయిబాబాను మనస్ఫూర్తిగా ఆరాధిస్తే, ఆయనను స్మరిస్తే, సాయిబాబా తమ జీవితంలో ఆనందాన్ని నింపుతాడని నమ్మకం. గురువారం రోజున చేసే పూజ విధానం .. ప్రాముఖ్యతను ఈ రోజు తెలుసుకుందాం.షిర్డీ సాయిబాబా మహిమ అపరిమితమైనదని భక్తుల విశ్వాసం. ఆయన ఎప్పుడూ కులం, మతం లేదా జీవుల మధ్య వివక్షత చూపలేదు. ఎవరైతే భక్తితో సాయిబాబాని పిలిస్తే తన భక్తులను చేరుకుంటాడని ప్రజలు అంటారు. గురువారాల్లో ఉపవాసం ఉండటం వల్ల సాయి ప్రత్యేక అనుగ్రహం తన భక్తులపై కురుస్తాడు. సాయిబాబా ఎప్పుడూ 'సబ్ కా మాలిక్ ఏక్ హై ' అనే సందేశాన్ని ఇచ్చేవారు. విశ్వాసాల ప్రకారం, సాయిబాబా తనను పూర్తి విశ్వాసంతో పూజించే భక్తులకు ఎటువంటి కష్టము ఎదురైనా వాటిని తొలగిస్తాడని విశ్వాసం.



**సాయి పూజ విధానం**

సాయిని పూజించాలంటే ముందుగా గురువారం బ్రహ్మ ముహూర్తంలో మేల్కొని.. అభ్యంగ స్నానమాచరించాలి.

వాస్తు శాస్త్రం ప్రకారం ఇల్లు ఎలా ఉండాలి, ఏ దిశలో ఏమి ఉండాలి? పూర్తి వివరాలు మీ కోసం..

స్నానం చేసిన తర్వాత సాయిబాబాను ధ్యానించాలి. గురువారం ఉపవాస దీక్షను చేపట్టాలి.

శరీరం, మనస్సు స్వచ్ఛంగా ఉండేలా చూసుకుని సాయిబాబా విగ్రహం లేదా చిత్రపటం ప్రతిష్టించి.. దానిపై గంగాజలం చల్లండి. విగ్రహంపై పసుపు రంగు వస్త్రాన్ని ఖచ్చితంగా ఉంచాలి. సాయిబాబా విగ్రహానికి కుంకుమ, పూలు, అక్షతలు కూడా సమర్పించాలి.

పళ్ళెంలో అగరబత్తులు, నెయ్యి వేసి సాయిబాబాకు హారతినివ్వాలి.

ముఖ్యంగా విగ్రహానికి పసుపు పుష్పాలను సమర్పించండి. అనంతరం అక్షత, పసుపు పువ్వులను చేతిలోకి తీసుకుని బాబా కథను వినండి.

సాయిబాబా పూజకు పసుపు రంగు శుభప్రదంగా పరిగణించబడుతుంది. అందుకే బాబాకు పసుపు మిఠాయిలను మాత్రమే సమర్పించండి.

పూజ అనంతరం నైవేద్యం పెట్టిన మిఠాయి ప్రసాదాన్ని అందరికీ పంచండి.

మీరు దానం చేయగలిగితే, మీ సామర్థ్యం మేరకు ఆపన్నులకు దానం చేయండి.

సాయిబాబా ఉపవాసం ఎప్పుడు ఆచరిస్తారు?

సాయిబాబా వ్రతాన్ని ఆచరించడానికి గురువారం అత్యంత విశిష్టత కలిగిన రోజు. బాబా భక్తులు ఈ రోజున ఉపవాసం ప్రారంభించి నియమ నిబంధనల ప్రకారం పూజలు చేయాలి. కనీసం 9 గురువారాలు ఉపవాసం పాటించాలి. ఉపవాస సమయంలో పండ్లు తినడం మంచిది. ఉపవాసం ప్రారంభించేటప్పుడు 5, 7, 9, 11 లేదా 21 వారాలు ఉపవాసం ఉంటానని చెప్పాలి. గురువారం రోజున ఉపవాసం ఉన్నవారు ఈ రోజున పేదలకు ఆహారాన్ని అందించాలి. శక్తిమేరకు దానం చేయాలి. పేదలకు సేవ చేసిన వారి పట్ల సాయిబాబా చాలా సంతోషిస్తారు.

సాయిబాబా ఉపవాసం చేసే విధానం

గురువారం సాయిబాబా ఉపవాసం దీక్ష సంకల్పించాలి. బాబాను నిర్మల హృదయంతో పూజిస్తేనే గురువారం వ్రతం చేసిన ఫలితం లభిస్తుంది.చిన్నపిల్లలు, వృద్ధులు లేదా స్త్రీలు ఎవరైనా సరే ఉపవాసాన్ని ఆచరించవచ్చు కానీ ఉపవాసాల సంఖ్య 9 గురువారాలు ఉండాలి.బాబా ఉపవాస సమయంలో మనశ్శాంతి కలిగి ఉండటం చాలా ముఖ్యం. ఇతరులపై పగ పెంచుకోకుండా ప్రయత్నించండి.లేకపోతే పూజ ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది.

కఠిన ఉపవాస దీక్ష బాబా మెచ్చరు. కనుక మీ సామర్థ్యాన్ని బట్టి ఈ ఉపవాసాన్ని పాటించవచ్చు. ఒక పూట భోజనం లేదా పండ్లు, అల్పాహారం కూడా తీసుకోవచ్చు.

ఏవైనా అనుకోని కారణాల వల్ల మీరు గురువారం ఉపవాసం మిస్ అయితే లేదా అలా చేయలేకపోతే.. ఆ గురువారం లెక్కించవద్దు. నెక్స్ట్ గురువారం ఉపవాసం కొనసాగించండి.

ఉపవాస సమయంలో సాయిబాబాకు ప్రసాదం సమర్పించిన తర్వాత, దానిని ఇతరులకు పంచాలి.స్త్రీలు ఉపవాస సమయంలో రుతుక్రమం మొదలైన సమస్యలను ఎదుర్కొంటే లేదా కొన్ని కారణాల వల్ల ఉపవాసం చేయలేకపోతే, వారు ఇతర గురువారాల్లో కూడా ఉపవాసం ఉండవచ్చు.

బాబా ఉపవాసం చేస్తున్న సమయంలో బాబా సచ్చరిత వంటి పుస్తకాలను 5, 11 లేదా 21 పుస్తకాలను బంధువులకు లేదా పొరుగువారికి ఇవ్వవచ్చు. ఇలా చేయడం వలన ఉద్యాపనను పూర్తి అవుతుంది.

ఆఖరి రోజున ఉపవాస సమయంలో ఉపవాసం ఉండే వ్యక్తి పేదలకు అన్నదానం చేయాలి.


ఉపవాస సమయంలో సాయిబాబా ఆలయాన్ని సందర్శించి దీపం వెలిగించండి.

ఉపవాస సమయంలో మీరు టీ, పండ్లు మొదలైన వాటిని కూడా తీసుకోవచ్చు.

సాయి వ్రతం సమయంలో చేయకూడని తప్పులుసాయిబాబాకు ఉపవాస చేసే సమయంలో ఎవరితోనూ అనుచితంగా ప్రవర్తించకండి.సాయిబాబాను పూజించేటప్పుడు గొప్పను ప్రదర్శించవద్దు.

# బద్రినాథ్ రహస్యాలేంటో తెలుసా... ఈ గుడిని 6 నెలల పాటు ఎందుకని





హిందూ మతాన్ని విశ్వసించే వారిలో ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఒక్కసారైనా ఛార్‌థామ్ యాత్రను చేయాలని కోరుకుంటారు. ఇప్పటికే ఏప్రిల్ మాసంలో ఈ యాత్రకు వేలాది మంది భక్తులు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఈ చార్‌థామ్ యాత్రలోని పవిత్ర పుణ్యక్షేత్రాలలో బద్రినాథ్ ఒకటి. హిందూ పురాణాల ప్రకారం, శ్రీ మహా విష్ణువుకు సంబంధించిన ప్రధాన ప్రదేశం. బద్రినాథ్ విష్ణువుకు సంబంధించిన 24 అవతారాలలో ఒకటిగా పరిగణించబడుతుంది. ఇందులో నర, నారాయణు ఋషులే నివాసం ఉండేవారు. హిందూ మత విశ్వాసాల ప్రకారం, నారాయణుడు ఈ ప్రాంతంలో నరునితో కలిసి తపస్సు చేశాడు. ఇదిలా ఉండగా బద్రినాథ్ ఆలయానికి సంబంధించిన ఎన్నో విశేషాలు.. వింతలు..రహస్యాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం...

**మూడు ప్రధాన ద్వారాలు తెరచుకోవాలంటే...**

ఈ ఏడాది బద్రినాథ్ ఆలయ తలుపులు 27 ఏప్రిల్ 2023న తెరవనున్నారు. సాధారణంగా ఏ గుడి తలుపులైనా తాళపు చెవితో తెరుస్తారు. కానీ బద్రినాథ్ ఆలయ తలుపులు మాత్రం మూడు తాళాల ద్వారా తెరవబడుతుంది. ఇందులో మరో ఆసక్తికరమైన విషయమేమిటంటే.. ఈ మూడు కీలు ముగ్గురు వేర్వేరు వ్యక్తుల దగ్గర ఉంటాయి. స్థానికుల సమాచారం మేరకు.. ఒక తాళపు చెవి తెహ్రీ రాజ్ కుటుంబ పూజారి దగ్గర ఉంటుంది. మరో కీ బద్రినాథ్ ధామ్ మెహతార్ వద్ద ఉంటుంది. ఇంకో తాళపు చెవి హక్ భండారీ ప్రజల దగ్గర ఉంటుంది. ఈ గుడి తలుపులను కేవలం ఒక తాళపు చెవితో తెరవలేరు. మూడు తాళపు చెవులు ఉంటేనే ఈ బద్రినాథ్ ఆలయ తలుపులు తెరచుకుంటాయి.

**నెయ్యి చెక్కు చెదరకుండా ఉంటే...**

బద్రినాథ్ ఆలయ తలుపులు మూసివేయడానికి ముందు శ్రీ మహా విష్ణువు విగ్రహానికి నెయ్యి పూస్తారు. అనంతరం ఆరు నెలల తర్వాత ఈ ఆలయ తలుపు తెరిచినప్పుడు పండితులు మాత్రమే ముందుగా గుడిలోకి ప్రవేశిస్తారు. అప్పుడు విగ్రహానికి పూసిన నెయ్యి చెక్కు చెదరకుండా ఉండిపోతే దేశం సుభిక్షంగా ఉంటుందని నమ్ముతారు. మరోవైపు నెయ్యి తక్కువగా లేదా పొడిగా ఉంటే దేశంలో అధిక వర్షపాతం సంభవిస్తుందనడానికి సంకేతంగా భావిస్తారు.ప్రతి సంవత్సరం బద్రినాథ్ ఆలయంతో సహా కేధారనాథ్, గంగోత్రి, యమునోత్రి ఆలయాల తలుపులు ఆరు నెలల పాటు భక్తుల దర్శనానికి నోచుకోకుండా మూసివేయబడతాయి. హిందూ మత విశ్వాసాల ప్రకారం, బద్రీనాథ్ విశ్వంలోని ఎనిమిదో వైకుంఠంగా పిలువబడుతుంది. ఇక్కడ శ్రీ మాహా విష్ణువు 6 నెలలు నిద్రపోతారు. మరో నెలలు మాత్రమే మేల్కొని ఉంటారు. అంతేకాదు శీతాకాలంలో విపరీతంగా మంచు కురవడం వల్ల ఈ ఆలయ తలుపులు యూసివేయబడతాయి.బద్రినాథ్ ఆలయం ఉత్తరాంచల్‌లోని అలకానంద నది ఒడ్డున నర, నారాయణ అనే రెండు పర్వతాల మధ్య ఉంది. ఇక్కడ నర-నారాయణ విగ్రహాల్ని పూజిస్తారు. ఈ ఆలయంలో శ్రీ హరి విగ్రహం చతుర్భుజ ధ్యానంలో కూర్చున్న శాలిగ్రామ రాతితో చేయబడింది.

మన వెలుగు
ప్రతి వార్త ప్రజల పక్షాన తెలుగు దినపత్రిక
MANA VELUGU TELUGU DAILY
శనివారం 02 నవంబర్ 2024

# నల్లమలలో జంగిల్ సఫారీ..

# అందమైన అడవులు, వన్యమృగాలు.. ఇంకెన్నో అద్భుతాలు






నల్లమల అడవి సుమారు 10 వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో కృష్ణా -పెన్నా నదుల మధ్య ప్రాంతంలో విస్తరించి ఉంటుంది.తూర్పు కనుమలలో నల్లమల అడవులు ఒక భాగం. పల్నాడు జిల్లా లోని గుత్తికొండ నుండి నల్లమల అడవులు ప్రారంభమౌ తాయి. నల్లమల మధ్యభాగం లోని నాగార్జునసాగర్ - శ్రీశైలం టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ దేశంలోనే రెండవ అతిపెద్ద పులుల అభ్యయారణ్యం. దీనిపరిధి సుమారు 3 వేల ఐదు వందల చదరపు కిలోమీటర్లు. ఇక్కడ దాదాపుగా 73 వరకు పులులు వందల సంఖ్యలో చిరుత పులులు,ఎలుగుబంట్లు ఉన్నాయని ఫారెస్ట్ అధికారులు తెలియజేశారు. నల్లమలమరోవైపు నల్లమల అభయారణ్యంలో జీవ వైవిధ్యంపై శాస్త్రవేత్తల పరిశోధనలు జరుపుతున్నారు. సున్నిపెంటలోని బయోడైవర్సిటీ కేంద్రంగా ఈ పరిశోధనలు సాగుతున్నాయి. గత కొంత కాలంగా నల్లమలలో వన్యప్రాణుల సంతతి పెరుగుతూ వస్తోంది. దట్టమైన అడవులు కూడా విస్తరిస్తున్నాయని రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ప్రపంచం లో మరెక్కడా లేనటువంటిది,కేవలం నల్లమల అడవులలో మాత్రమే కనిపించే అరుదైన మూషిక జింక నల్లమల అడవుల ప్రత్యేకం.ఇవి మూడు సెంటీమీటర్ల నుండి ఎనిమిది సెంటీమీటర్ల వరకు పెరుగుతాయి.రెండు నుండి మూడు కిలోలు మాత్రమే బరువు పెరుగుతాయి.వీటిని అధికారులు అంతరించిపోయిన జాతిగా నమోదు చేశారు.ఐతే అనూహ్యంగా గడచిన ఐదేళ్ళలో తొలిసారి మూషిక జింకలను మళ్ళీ గుర్తించారు.ఇంకా జింకలు ,కణితి లు, సాంబార్ డీర్ లు ,దుప్పులు ,కొండగొర్రెలు ఇక్కడ ఆవాసం ఏర్పరచుకొన్నాయి. నల్లమలలో అత్యంత అరుదైన శ్రీలంకన్ ఫ్లైయింగ్ స్నేక్, అరుదైన జాతికి చెందిన గద్ద లను ,వందలాది రకాల సాలీడు లను మరెన్నో రకాల అరుదైన కీటకాలను శాస్త్రవేత్తలు నల్లమల అభయారణ్యంలో కనుగొన్నారు.వీటిలో మెటోక్రొమాస్‌టిస్ నైగ్రోఫి యొరేటో, మారస్ శ్రీశైల యెన్సిస్(సాలీడు), నాగార్జునసాగర్ రేజర్(పాము), స్లెండర్ కోరల్ స్నేక్ (పాము), ఫ్రీనికస్ ఆంధ్రాయెన్సిస్(సాలీడు), పోయిసిలోథీరియా నల్లమలైయెన్సిస్(సాలీడు), సిరాప్టిరస్ లాటిప్స్ (కీటకాలు), డారిస్తీన్స్ రోస్ట్రాటస్(గొల్లభామ), శ్రీలంకన్ ఫ్లైయింగ్ స్నేక్, టు స్పాటెడ్‌బార్బ్ అనే అరుదైన చేప, నీటి పిల్లులు, కొండ గొర్రెలు ముఖ్యమైనవి. నల్లమలలో మొత్తం సుమారు 55 క్షీరద జాతులు,200 పైగా పక్షుల రకాలు, 18 రకాల ఉభయచర జీవులు, సరీసృపాలు, లక్షకు పైగా కీటక జాతులు ఉన్నాయి.ఇంతటి సుందరమైన నల్లమలలో విహరించి సందర్శకులకు అడవుల ప్రాముఖ్యత పర్యావరణ పరిరక్షణ గురించి తెలుసుకోవడం తో పాటు వారికి వినోదం , విజ్ఞానం కూడా అందించాలనే లక్ష్యంతో అటవీ శాఖ, ఆంధ్రప్రదేశ్ ఎకో టూరిజం సంయుక్తంగా ఏర్పాటు చేసిందే తుమ్మలబయలు లోని జంగిల్ సఫారీ. జులై ఆగస్ట్ నెలలు మినహా మిగతా రోజులలో ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు సఫారీ అందుబాటులో ఉంటుంది. ఒకేసారి ఆరుగురిని వాహనంలో తీసుకెళ్తారు. ఆరుగురికి కలిపి ప్యాకేజీ ధర రూ.2400గా ఉంది. సందర్శకులు ఆన్ లైన్ లో గానీ,ఆఫ్ లైన్ లో గానీ టికెట్లు పొందవచ్చు.

జులై ఆగస్ట్ నెలలు మినహా మిగతా రోజులలో ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు సఫారీ అందుబాటులో ఉంటుంది. ఒకేసారి ఆరుగురిని వాహనంలో తీసుకెళ్తారు.నల్లమల లో జంగిల్ సఫారి.అడవులు,అడవి జంతువుల గురించి వినడమే తప్ప ప్రత్యక్షంగా చూడాలని కలలు కనే వారి కోసం ఏ.పి ఫారెస్ట్ అండ్ ఏ.పి ఎకో టూరిజం శాఖలు సంయుక్తంగా దోర్నాల-శ్రీశైలం రోడ్డులోని తుమ్మలబయలు వద్ద జంగిల్ సఫారీని ప్రారంభించింది. రెండు గంటల పాటు సాగే ఈ సఫారీలో ఎన్నో మధురస్మృతులు మీ సొంతం చేసుకోవచ్చు.పెద్ద పులి మీ ప్రక్కనుండే వెళ్ళొచ్చు, చిరుత పులి మీ వాహనం పై దూకవచ్చు, ఎలుగు బంటి వెక్కిరించవచ్చు,మూషిక జింక మురిపించవచ్చు. అంతటి అద్భుత అవకాశాన్ని మీకు కల్పిస్తుంది తుమ్మలబయలు లోని నల్లమల అడవులు జీవవైవిధ్యానికి చిరునామ. ఎత్తైన కొండలు, పాతాళాన్ని తలపించే లోయలు ,మహావృక్షాలు, ఔషద మొక్కలు,పచ్చికబయళ్ళు, పారే శెలయేళ్ళు, వన్యప్రాణులు, కరమృగాలు, పక్షులు ,కీటకాల తో పాటు వేలాది జీవజాతులతో అలరారే అందమైన అడవి.

## మెదక్ కోట చరిత్ర ప్రసిద్ధమైనవి



మెదక్ కోట ఒక వారసత్వ నిర్మాణం మరియు మెదక్ పట్టణం యొక్క ప్రసిద్ధ పర్యాటక ఆకర్షణ. ఈ కోట తెలంగాణ ప్రాంతంలో చారిత్రక మరియు నిర్మాణ ప్రాముఖ్యతను కలిగి ఉంది. మెదక్ కోట ఒక కొండ పైభాగంలో గూడు కట్టుకునే భారీ నిర్మాణం.ఈ అపారమైన కోట సుమారు 800 సంవత్సరాల క్రితం మెదక్ లో నిర్మించబడింది, ఇది అప్పటి జిల్లాకు ప్రధాన కార్యాలయంగా ఉంది. ఈ కోట దాని విలక్షణ నిర్మాణంతో ఒకరి దృష్టిని కలిగి ఉంది .12 వ శతాబ్దంలో కాకతీయ పాలకుడు ప్రతాపా రుద్ర హయాంలో ఈ కోట నిర్మించబడింది మరియు దీనిని మొదట తెలుగులో 'మెతుకుదుర్గం' అని పిలిచేవారు. ఇది కాకతీయులకు మరియు తరువాత కుతుబ్ షాహిలకు కమాండ్ పోస్టుగా పనిచేసింది. ఈ కోటలో కుతుబ్ షాహిస్ నిర్మించిన ప్రాంగణంలో 17 వ శతాబ్దపు మసీదు, అలాగే ధాన్యాగారాలు ఉన్నాయి.

**ముఖ్యాంశాలు**

మీరు ఈ అందమైన కోట పైభాగానికి చేరుకోవాలనుకుంటే, 500 కంటే ఎక్కువ మెట్లు మీ కోసం ఎదురుచూస్తున్నందున మీరు మీ శక్తిని పెంచుకోవాలి. ఇది భూమట్టం నుండి సుమారు 90 మీటర్ల ఎత్తులో మరియు కొండ ప్రాంతంలో 100 ఎకరాలలో విస్తరించి ఉంది.మెదక్ కోటలో మూడు ప్రధాన ద్వారాలు ఉన్నాయి, అవి "ప్రథమ ద్వారం", "సింహా ద్వారం", ఈ ప్రవేశ ద్వారాల పైభాగంలో రెండు స్నార్లింగ్ సింహాలను కలిగి ఉంది, అయితే "గజద్వరం" లేదా ఎలిఫెంట్స్ ప్రవేశంలో రెండు ఏనుగులు గంభీరంగా ఇంటర్‌లాక్ చేయబడిన శిల్పం ఉన్నాయి.

ప్రధాన ద్వారం గొప్ప పాలకుడు శ్రీకృష్ణ దేవరాయ నిర్మించిన విజయనగర సామ్రాజ్యం యొక్క చిహ్నం అయిన డబుల్ హెడ్ "గండభేరుండం" ను కలిగి ఉంది. ఇక్కడ, ఒక 17 వ శతాబ్దపు ఫిరంగిని గుర్తించవచ్చు, ఇది 3.2 మీటర్ల పొడవు, దానిపై త్రిశూలం చెక్కబడి ఉంటుంది.ఈ కోట సహజ స్థలాకృతిని ఉపయోగించుకుంటుంది, ఎందుకంటే రాతి ఉపరితలం సహజ రక్షణను అందిస్తుంది. పురాతన మెదక్ కోటలో ఒక చిన్న సరస్సు, బారక్(సిపాయిలు ఉండే శాల)మరియు గిడ్డంగి కూడా ఉన్నాయి.

**ఎలా చేరుకోవాలి**


మెదక్ కోట మెదక్ పట్టణంలో ఉంది, ఇది హైదరాబాద్ నుండి రహదారి ద్వారా చేరుకోవచ్చు, ఇది దాదాపు 96 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇది హైదరాబాద్ నగరం నుండి ఒకటిన్నర గంటల ప్రయాణంలో చేరుకోవచ్చు.

**ఎక్కడ ఉండాలి**

మెదక్ వద్ద హరితా వసతి గదులు మెదక్ కోట గోడలకు దగ్గరగా నిర్మించబడ్డాయి, అద్భుతమైన వారసత్వ నేపథ్యం మధ్య అసమానమైన వాతావరణాన్ని అందిస్తున్నాయి. ఇక్కడ చక్కగా నిర్వహించబడుతున్న హరితా హెరిటేజ్ హోటల్ సూట్లు వసతి కోసం ఈ హోటల్‌ను ఎంచుకునే పర్యాటకులకు గరిష్ట సౌకర్యాన్ని అందిస్తాయి.

# వేసవిలో హనీమూన్‌కు వెళ్లాలనుకుంటే..

# ఈ అందమైన దేశాలున్నాయి కదా..!









కొత్తగా పెళ్లైన జంటలు సమ్మర్లో హనీమూన్ వెళ్లాలనుకుంటున్నారా? విదేశాల్లో విహరించాలని ప్లాన్ చేస్తున్నారా.. అయితే ప్రపంచంలోనే ఈ సుందర ప్రదేశాల్లో మీకు నచ్చిన వాటిని సెలెక్ట్ చేసుకోండి.. మీ పార్ట్నర్‌తో రిలేషన్‌ను మరింత స్ట్రాంగ్‌గా మార్చుకోండి..

వేసవిలో హనీమూన్‌కు వెళ్లాలనుకుంటే.. ఈ అందమైన దేశాలున్నాయి కదా..!

నూతన వధూవరులు లేదా జంటలు వేసవిలో విదేశీ టూర్ ప్లాన్ చేస్తున్నట్లయితే ఇక్కడ పేర్కొన్న దేశాలను ఒకసారి పరిశీలించండి. ఈ దేశాల్లో మీ ఏకాంతానికి లోటుండదు. అలాగే అవి మీ ప్రియమైనవారితో పాటు మిమ్మల్నీ మంత్రముగ్ధులను చేస్తాయనడంలో సందేహం లేదు. అక్కడి సందర్శనా స్థలాలు, ఉత్కంఠభరితమైన సహజ దృశ్యాలు, రోమన్ ఆర్కిటెక్చర్, శృంగారభరితమైన ప్రదేశాలు మిమ్మల్ని మరింత రెచ్చగొడతాయి. ఆ దేశాలేవో ఇక్కడ చూద్దాంపదండి.

ఇటలీ..ప్రపంచంలోని అత్యంత శృంగారభరితమైన గమ్యస్థానాల్లో ఇటలీ ఒకటి. ఇది ఐరోపాలోని అద్భుతమైన దేశం కూడా. ఇది నూతన జంటల ఏకాంతానికి తగిన ప్రదేశంగా చెప్పవచ్చు. ఇటలీలోని వెనిస్, మిలన్, ఫ్లోరెన్స్ వంటి అద్భుతమైన నగరాలు శృంగారభరితమైన గమ్యస్థానాలను కలిగి ఉంది.

మీరు భారతదేశం వెలుపల హనీమూన్ గురించి ఆలోచిస్తుంటే తప్పకుండా ఇటలీని ఎంచుకోవచ్చు. అలాగే, మే నుండి సెప్టెంబర్ వరకు ఇటలీని సందర్శించడానికి ఉత్తమ సమయం. దిల్లీ లేదా ముంబై నుండి ఇటలీకి నేరుగా వెళ్లొచ్చు.

గ్రీస్..గ్రీస్..గ్రీస్‌లో సుమారు 6 వేల వరకు అద్భుతమైన దీవులు ఉన్నాయి. వాటిల్లో 227 మాత్రమే నివాసయోగ్యమైనవి. అక్కడి క్రిస్టల్ క్లియర్ బీచ్‌లు, ఎత్తైన పర్వతాలు, బహుసుందరమైన రిసార్టులు, పురాతన శిధిలాలు తప్పకుండా ఆకట్టుకుంటాయి.

దీంతో ఈ ప్రదేశం కొత్త దంపతులకు విహరించడానికి చెప్పుకోదగ్గ విధంగా ఉంటుంది. ఇక్కడ ప్రైవసీ కోరుకునేవారికి ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ఇది కూడా మే నుండి సెప్టెంబర్ వరకు సందర్శించడానికి ఉత్తమంగా ఉంటుంది. అక్కడ ఏథెన్స్, పార్థినాన్, మెటియోరా, మ్యూజియాలు, ప్లాకా, టెంపుల్ ఆఫ్ హెఫెస్టస్ ప్రధాన ఆకర్షణలు.

**స్పెయిన్..**

స్పెయిన్..స్పెయిన్ అన్యదేశ బీచ్‌లు, మంచు పర్వతాలు, ఆహ్లాదకరమైన రాత్రులకు ప్రసిద్ధి చెందింది. అక్కడ అనేక సందర్శనీయ ప్రదేశాలను చూడొచ్చు. స్పెయిన్‌లో మీ ప్రియమైనవారితో కలిసి లగ్జరీ హోటళ్లు లేదా రిసార్ట్‌ల్లో విడిది చేస్తే జీవితాంతం గుర్తుండిపోయే మధురక్షణాలు సొంతం చేసుకోవచ్చు. అవి జంటల విడిదికి సరైనవి. స్పెయిన్‌లోని ప్రతి టూరిస్ట్ స్పాట్ అద్భుతమైన డిజైన్, ఆర్కిటెక్చర్‌లు కలిగి ఉంటాయి. ఇది మే నుండి జూలై వరకు సందర్శించవచ్చు. అక్కడ టెనెరిఫే, కానరీ ఐలాండ్, మాడ్రిడ్, టోలెడో, కోస్టా గలీసియా, అలికాంటే ప్రధాన ఆకర్షణలుగా ఉన్నాయి. వాటిని తప్పక సందర్శించండి. (

**స్విట్జర్లాండ్..**

స్విట్జర్లాండ్..ప్రపంచంలోని అత్యంత ఆకర్షణీయమైన విదేశీ గమ్యస్థానాల్లో స్విట్జర్లాండ్ ముందువరుసలో ఉంటుంది. అది అద్భుతమైన ప్రకృతి దృశ్యాలకు, మైమరపించే హిమాలయ పర్వతాలకు ప్రసిద్ధి చెందింది. దీంతో ఇక్కడ హనీమూన్ చేసుకోవాలనుకునే జంటలు చాలా మంది ఉంటారు. అలాగే స్విట్జర్లాండ్ అద్భుతమైన సాహసయాత్రలకు కూడా పేరుగాంచింది. అక్కడ ట్రెక్కింగ్, మౌంటెనింగ్, బైకింగ్ వంటి సాహసాలు చేయొచ్చు.ఇది జూన్ నుండి సెప్టెంబర్ వరకు గొప్ప వీక్షణలను కలిగి ఉంటుంది. చూడాల్సినవాటిల్లో లూసర్న్ మ్యూజిక్ ఫెస్టివల్, జెనీవా, జ్యూరిచ్, లౌసాన్‌ను అస్సలు మిస్ చేసుకోవద్దు.

**లండన్..**

లండన్..ఇంగ్లండ్ రాజధాని లండన్ కొత్త దంపతులకే కాకుండా ఎవరికైనా ఇట్టే నచ్చుతుంది. ఈ నగరం ప్రధానంగా అనేక రోమన్ శైలి భవనాలను కలిగి ఉండటంతో చూడముచ్చటగా ఉంటుంది. ఇది ఏటా 15.3 మిలియన్ల అంతర్జాతీయ సందర్శకులను ఆకర్షిస్తుంది. దీంతో ఇది విదేశీ గమ్యస్థానాల్లో ఎలా ఉంటుందో మీరే అర్థం చేసుకోవచ్చు. లండన్‌ను సందర్శించడానికి మే నుండి అక్టోబర్ వరకు బాగుంటుంది. లండన్‌ను సందర్శించినప్పుడు లండన్ ఐ, టవర్ ఆఫ్ లండన్, బ్రిటిష్ మ్యూజియం, క్రిస్టల్ పార్క్, గోల్డర్స్ హిల్స్ పార్క్ వంటివి చూసి తీరాల్సిందే. ఇవన్నీ కొత్త జంటలకు మంచి వెకేషన్ అందించడమే కాకుండా వారు ఏకాంతంగా గడపడానికి గొప్ప పర్యాటక ప్రదేశాలుగా నిలుస్తాయి